# ఇల్లీగల్ పై గల్లీ గల్లీ వేట..

## 100 మందికి పైగా సిబ్బందితో పోలీస్ వ్యూహం

**55 ద్విచక్ర వాహనాలు సీజ్**

**మద్యం సీసాలు, నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం**

**రౌడీషీటర్లకూ కౌన్సెలింగ్**



ప్రజలతో మాట్లాడుతున్న డిఎస్పీ అంజయ్య

**వికారాబాద్, మే 24, ప్రభాతవార్త:** వికారాబాద్ పోలీసులు ఆదివారం భారీ కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా, ఈ తనిఖీలు తెల్లవారుజామున 5:00 గంటల నుండి ఉదయం 7:00 గంటల వరకు దాదాపు రెండు గంటల పాటు ముమ్మరంగా కొనసా గాయి. ఈ విస్తృత తనిఖీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి పోలీస్ శాఖ ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేసింది. ఇందులో భాగంగా తొమ్మిది కట్ఆఫ్ పార్టీలు, ఐదు సెర్చ్ పార్టీలు, ఐదు లిఫ్టింగ్ పార్టీలతో పాటు, హోల్డింగ్ పాయింట్ వద్ద బలమైన బందోబస్తు ఏర్పాట్లను మోహ రించారు. ఈ ఆపరేషన్‌లో ముగ్గురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, 11 మంది సబ్ఇన్‌స్పెక్టర్లు, 100 మందికి పైగా పోలీస్ సిబ్బంది చురుగ్గా పాల్గొ న్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పాత నేర స్థుల కదలికలపై నిఘా పెట్టారు. కాలనీలను చుట్టుముట్టి, సరైన పత్రాలు లేని వాహనాలు, అసాంఘిక శక్తులు, లేదా అక్రమంగా నిల్వ ఉంచిన వస్తువులను తనిఖీ చేశారు. స్థానికంగా ఉండే శాంతిభద్రతల సమస్యలు, తాగుబోతుల గొడవలు, వేధింపుల వంటి విషయాలను నేరుగా ప్రజల నుంచి తెలుసుకునే ప్రయత్నం చేశారు. నేరుగా కాలనీలు బస్తీలకు వెళ్లి పోలీసుల పట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని పోగొట్టే ప్రయత్నం చేశారు. సైబర్ నేరాలు, గంజాయి/డ్రగ్స్ రవాణా, ట్రాఫిక్ నిబంధనలు, మహిళల రక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ తనిఖీల్లో భాగంగా, గరీబ్ నగర్ ప్రాంతంలో సరైన పత్రాలు లేకుండా అనుమానాస్పదంగా తిరుగుతున్న 55 ద్విచక్ర వాహనాలను పోలీ సులు సీజ్ చేశారు. వాహన యజమానులు తమ వాహనాలకు సంబంధించిన అసలు పత్రా లను సమర్పించి, తదుపరి చట్టపరమైన ప్రక్రి యల తర్వాతే వాహనాలను అప్పగిస్తామని పోలీ సులు స్పష్టం చేశారు. అలాగే, ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన పెద్ద ఎత్తున మద్యం సీసాలు, నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసు కున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలను పర్యవేక్షించడంలో భాగంగా, అదే ప్రాంతంలో నివసిస్తున్న ఐదుగురు రౌడీషీటర్లను గుర్తించి హోల్డింగ్ పాయింట్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, వారి ఆధార్ కార్డులను పరిశీలించి, పాపిలాన్ డివైజ్ ద్వారా వారి వేలిముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా వికారాబాద్ డీఎస్పీ అంజయ్య మాట్లాడుతూ, ఎవరైనా అక్రమ కార్యకలాపాలకు పాల్పడినా, ప్రజల్లో భయాందోళనలు సృష్టించినా సహించేది లేదని, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుం టా మని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని, కాలనీల్లో ఎలాంటి అనుమా నాస్పద వ్యక్తులు లేదా వస్తువులు గమనించినా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రజల రక్షణ, భద్రత కొరకు ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు.





**రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్**

## వ్యవసాయాధికారి హఠాన్మరణం

### గుండెపోటుతో కుప్పకూలిన వీరస్వామి



వీరస్వామి

**కుల్కచర్ల, మే24, ప్రభాతవార్త:** గుండె పోటుతో మండల వ్యవసాయ అధికారి మృతి చెందాడు. కుల్కచర్ల మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న వీరస్వామికి అదివారం ఉదయం గుండె పోటు వచ్చింది. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమిం చడంతో హైదరాబాద్ ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలిం చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వీరస్వామి మృతి చెందాడు. వీరస్వామి స్వగ్రామం ఆంధ్రప్రదేశ్, రాష్ట్రం వెస్ట్ గోదావరి జిల్లా వెల్పూ ర్‌కు వీరస్వామి మృతదేహన్ని తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరస్వామి వ్యవసాయ శాఖ అధికారిగా ప్రజలుకు ఎంతగానో సేవలందిచారు. ఆయన మృతి పట్ల మండల ప్రజలతో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# నడిరోడ్డుపై నవమాసాల భారం



రైల్వే ప్లాట్‌ఫారం నుంచి శిశువును ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

- ప్రేమించిన పాపానికి కన్నవారి కాఠిన్యం
- గర్భంతో వచ్చిన యువతికి పుట్టింట్లో నిరాకరణ
- కళ్ల ముందే భర్తపై దాడి
- అవమానభారంతో వదిలి వెళ్లిపోయిన భర్త
- దిక్కులేని స్థితిలో వీధిన పడ్డ గర్భిణి
- బిడ్డను స్వీకరించలేని తల్లి దైన్యం
- శిశువిహార్‌కు చేరిన శిశువు
- బాధితురాలికి ఆర్థిక సహాయం చేసిన స్థానిక నేతలు

**గాంధీ ఆసుపత్రి నుండి తప్పించుకొచ్చిన 20 ఏళ్ల గర్భిణి**

**తాండూరు రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై అర్ధరాత్రి గంటకు పైగా ప్రసవ వేదన**

**మొర ఆలకించని 108 అత్యవసర సేవలు**

**ప్లాట్‌ఫారంపైనే ప్రసవం**

**బిడ్డ క్షేమం, తల్లి పరిస్థితి విషమం**

**ఆసుపత్రికి తరలించిన స్థానికులు, ఆటో డ్రైవర్లు**



ఆర్థిక సహాయం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 24, ప్రభాతవార్త :** గాంధీ ఆసుపత్రి నుంచి తప్పించుకొచ్చిన ఓ మహిళ తాండూరు రైల్వే ప్లాట్‌ఫారంపై ప్రసవించింది. అర్ధరాత్రి వేళ రైల్వేస్టేషన్‌కు వచ్చిన ఆ మహిళ సుమారు గంట సేపు ప్రసవ వేదనకు గురైంది. నొప్పులు భరించలేక తల్లడిల్లగా పరిసరాల్లో ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు ఆమెను ఓదార్చరు. 108 వాహనానికి కాల్ చేసినా ఫలితం లేదు. కొంతసేపటికి ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ సంఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. శిశువు క్షేమంగా ఉన్నా తల్లి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు రూరల్ మండలం జినుగర్తి గ్రామానికి చెందిన 20 ఏళ్ల యువతికి కొంతకాలం క్రితం ప్రేమ వివాహం జరిగింది. గర్భం దాల్చిన తర్వాత భర్తతో పుట్టింటికి రాగా వారి పెళ్లిని కుటుంబీకులు అంగీకరిం చలేదు. పైగా వారు ఆమె భర్తపై చేయి చేసుకున్నారని తెలిసింది. దాంతో భార్యను వదిలిపెట్టి భర్త వెళ్లిపోయాడని స్థానికులు చెబుతున్నారు. నిండు గర్భిణిగా ఉన్న ఆమె ఇల్లు విడిచి బయటకు వచ్చింది. ఇటీవల గౌతాపూర్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఆమెను చూసిన పోలీసులు, స్థానికులు తాండూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్య పరిస్థితి బాగాలేదని గుర్తించిన వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె గాంధీ నుంచి తప్పించుకుని శనివారం రాత్రి తాండూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ప్రసవ వేదనతో ఆమె రోదనలు విన్న స్థానికులు 108 వాహనానికి పలు మార్లు కాల్ చేశారు. ఎలాంటి స్పందన లభించలేదని వారు తెలిపారు. కొంతసేపటికి ఆమె ప్రసవించడంతో అక్కడే ఉన్న ఆటోలో మహిళను, శిశువును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకు గాంధీ ఆస్పత్రికి పంపింతే.. అక్కడి నుంచి ఎలా వచ్చిందని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వర్గాలు అయోమయానికి గురయ్యారు. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరోసారి హైదరాబాద్ గాంధీకి తరలించారు. పుట్టిన బిడ్డను తాను స్వీకరించలేనని మహిళ చెప్పడంతో శిశువిహార్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజబాల్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బాతుల నాగరాజ్ తదితరులు ఆదివారం ఉదయం ఆసుపత్రికి చేరుకుని మహిళకు కొంత ఆర్థిక సహాయం అందజేశారు.

# అకాల వర్షాల ముప్పు పొంచి ఉంది

✦ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం ✦ రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండద్దు ✦ వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారీ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 24, ప్రభాతవార్త:** అకాల వర్షాల నేపథ్యంలో జిల్లా లోని వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వేచి ఉండే పరిస్థితులు ఉండకూడదని, పంటలు తడవకుండా కొనుగో లు ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయా లని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. ఆదివారం హైద రాబాద్, ఖమ్మం కలెక్టరేట్ల నుంచి ఉపము ఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలువురు మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి నిర్వహించిన రాష్ట్ర స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమీక్షలో ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్, ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక (మహిళా సంక్షేమ కార్యక్ర మాలు) అంశాలపై విస్తృతంగా చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ దీపక్ తివారి జిల్లా అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ.. అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నందున జిల్లాలో కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎక్కువ సమయం నిరీక్షి ంచే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. మహిళా సంక్షేమ వారోత్సవాల కార్యక్రమాలను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, జెడ్పీ సీఈఓ సుధీర్, డిఆర్డిఎ శ్రీనివాస్, పౌర సరఫరాల శాఖ అధికారులు సుదర్శన్, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం దృష్టికి ‘మహా సంగ్రామం’

**డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం**

**గాయకుడు నల్లగొండ గద్దర్ నర్సిరెడ్డి**

**ఇబ్రహీంపట్నం, మే 24 ప్రభాతవార్త:** యువత భవిష్యత్తును అంధకారం చేస్తున్న డ్రగ్స్, గంజాయి సంస్కృతిని సమాజం నుండి పూర్తిగా తుడిచిపెట్టేందుకు బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి ఆధ్వర్యంలో సాగుతున్న మహా సంగ్రామాన్ని త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ప్రముఖ గాయకుడు నల్లగొండ గద్దర్ నర్సి రెడ్డి స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల కోసం ఆదివారం బీఆర్ఆర్ మిగతా 4లో



డ్రగ్స్, గంజాయి సంస్కృతిని తుడిచిపెట్టేందుకు విద్యార్థులు తిరగబడాలని పాటల ద్వారా పిలుపునిస్తున్న నల్గొండ గద్దర్ నర్సి రెడ్డి

# వైద్యం వికటించి..బాలుడి బలి..!

**షాద్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకం**

**వాంతులని చేర్చితే రాత్రంతా ఉంచి నాసిరకం వైద్యం**

**పరిస్థితి విషమించడంతో చేతులెత్తేసిన వైద్యులు**

**హైదరాబాద్ తరలిస్తుండగా 12 ఏళ్ల మనీశ్వర్ మృతి**




**షాద్‌నగర్, మే 24, ప్రభాతవార్త :** వాంతులు అవుతున్నాయని ఆసుపత్రికి వస్తే, అవగాహన లేని నాన్ క్వాలిఫైడ్ వ్యక్తులు చేసిన వైద్యం ఒక బాలుడి ప్రాణాన్ని బలితీసుకుంది. ప్రైవేటు ఆసుపత్రుల్లో నకిలీ, అర్హత లేని సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటం, అధికారుల పర్యవేక్షణ కరువవ్వడం వల్లే ఈ ఘోరం జరిగిందని స్థానికులు మండిపడుతున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండంకు చెందిన రామచందర్ గత కొంత కాలంగా షాద్ నగర్ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. రామచందర్ కుమారుడైన 12 ఏళ్ల బాలుడు మనీశ్వర్‌కు శనివారం మధ్యాహ్నం వాంతుల వుతుండటంతో తల్లిదండ్రులలు పట్టణంలోని బాలాజి ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. బాలుడిని అడ్మిట్ చేసుకున్న ఆసుపత్రి యాజమాన్యం, మిగతా 4లో



మాట్లాడుతున్న మంత్రి వాకిట శ్రీహరి

## మాతో సహా ఎవరు తప్పు చేసినా..

# ప్రశ్నించాల్సిందే

**షాద్‌నగర్, మే 24, ప్రభాతవార్త :** పాలమూరు ప్రాజెక్టు పేరు చెప్పి రెండుసార్లు ఘనవిజయం సాధించి తరువాత మాట తప్పి కెసిఆర్ పాలమూరు ప్రజలకు ద్రోహం చేశాడు.. కానీ పాలమూరు బిడ్డగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరుకు న్యాయం చేస్తాడు.. పాలమూరు ప్రాజెక్టును వెంటనే పూర్తి చేస్తాం.. లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కలను సాకారం చేస్తాం.. అని రాష్ట్ర క్రీడలు, పాడి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణం లోని క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ ను పూర్తి చేయక పోతే ఏ నాయకుడైనా జీవితంలో ఏదో ఒకటి కోల్పోయినట్లే అని స్పష్టం చేశారు. కెసిఆర్ కు అడ్రస్ లేకపోయినా పాలమూరు జిల్లాలో ప్రాజె క్టు పూర్తి చేస్తాడని నమ్మి గెలిపించారని, కానీ కేవలం తమ అవినీతి కోసం ఈ ప్రాజెక్టును వాడుతున్నారని ఆరోపించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి 21 స్టేజీలు నీళ్ల దిగుమతి చేసు కుంటామంటూ కేవలం 18 స్టేజీలకు పరిమితం చేశారని, 58 వేల కోట్లు మంజూరు అయితే కేవలం 28 వేల కోట్లు మాత్రమే ఈ ప్రాజెక్టు కోసం ఖర్చు చేశారని విమర్శించారు. ప్రజా సంక్షేమం విషయంలో ఎవరు తప్పు చేసినా ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రజలపై ఉంటుందని, చివరికి తాము తప్పు చేసిన ప్రశ్నించాలని గుర్తు చేశారు. మిగతా 4లో

◆గత ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసింది
◆పాలమూరు ప్రాజెక్టు పనులు వేగంగా పూర్తి చేస్తాం..
◆భూసేకరణ వెంటనే మొదలవుతుంది..
◆మంత్రి వాకిటి శ్రీహరి..



పెద్దేముల్ మండలంలోని బీరప్పస్వామి జాతరలో డోలు వాయిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

4

## ఆందోళన వద్దు

**చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం**

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

# విజయ రహస్యాలు పంచుకుని..

- ఆ నాటి అల్లరి గుర్తుచేసుకుంటూ.. ఘట్కేసర్ జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సందడి
- 55 ఏళ్ల అపూర్వ కలయికతో ఆనందోత్సాహం
- బడి రుణం తీర్చుకుంటా: ఓయూ విసి

**ఘట్‌కేసర్ రూరల్, మే 24, ప్రభాతవార్త:** ఈర్ష్య, అసూయ, అహంకారాన్ని వీడితే, క్రమశిక్షణతో జీవితంలో అత్యున్నత శిఖరాలను చేరుకోవచ్చని ఉస్మానియా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ అన్నారు. పోచారం డివిజన్ అన్నోజిగూడలోని ఓ హోటల్‌లో ఘట్కేసర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 1970-71 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఘట్కేసర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఓయూ వైస్ ఛాన్సలర్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలలో చదివే వయసు ఎంతో కల్మషం లేనిదని, నాటి మధుర జ్ఞాపకాలు, ఆనందాలు మళ్లీ తిరిగి రావంటూ తన బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు. అట్టడుగు స్థాయి నుండి పట్టుదల, నిరంతర శ్రమతో అహర్నిశలు చదవడం వల్లే తాను ఈ రోజు ఈ ఉన్నత స్థానానికి చేరుకోగలిగానని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కొండాపూర్ లోని ప్రభుత్వ పాఠశాలను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయిస్తానని వైస్ ఛాన్సలర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అలాగే ఘట్కేసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, రూ. 10,000 నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. దాదాపు 55 సంవత్సరాల క్రితం తాము పదవ తరగతిలో చేసిన అల్లరిని, నాటి ఉపాధ్యాయులను ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా గుర్తుచేసుకున్నారు. తమ జీవిత చరమాంకంలో సాధించిన విజయాలను, కుటుంబ విషయాలను, అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకుంటూ రోజంతా సరదాగా గడిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు బ్రహ్మం, తల్లం కోటేశ్వర్రావు, జయ ప్రకాశ్, ప్రసాద్, సాయిలు, రామమూర్తి, సుకన్య, జ్ఞానిభాయి, సరస్వతి, మీనాక్షి తదితరులు పాల్గొని సందడి చేశారు.



ఓయూ వైస్ ఛాన్సలర్ కుమార్‌తో పూర్వ విద్యార్థులు

## ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

**11 మంది అరెస్ట్, భారీ ఎలక్ట్రానిక్ సామగ్రి స్వాధీనం**

**రంగారెడ్డి అర్బన్, మే 24 ప్రభాతవార్త :** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊట్‌పల్లి గ్రామంలోని రాయల్ విల్లాస్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠాను పోలీసులు బట్టబయలు చేశారు. టీఎస్ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి 11 మంది నిందితులను అదుపులోకి తీసుకు న్నారు. మరికొందరు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ఊట్‌పల్లి గ్రామం, స్ట్రీట్ నెం.8 లోని రాయల్ విల్లాస్‌లో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మిగతా 3లో



రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న నిత్యానందరావు, చిన్నారెడ్డి

## 28న సురవరం ప్రతాపరెడ్డి విగ్రహావిష్కరణ

**నాంపల్లి, మే 24 ప్రభాతవార్త :** తెలుగు భాషా సాహిత్య వికాసానికి విశేష కృషిచేసిన మహనీయుడు సురవరం ప్రతాపరెడ్డి జయంతిని పురస్కరించుకుని ఈనెల 28 మంగళవారం బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన సురవరం ప్రతాపరెడ్డి విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించాలని విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు కోరారు. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సంబంధిత ఆహ్వానపత్రికను తెలుగు సాహిత్యం, జర్నలిజం, చరిత్ర పరిశోధనరంగాల్లో చేసిన సేవలను భావితరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఆయన విగ్రహాన్ని విశ్వవిద్యాలయంలో ప్రతిష్టిస్తున్నట్లు ఉపాధ్యక్షుడు వివరించారు. రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విశ్వవిద్యాలయం అన్ని ఏర్పాటు చేపడుతున్నట్లు ఆచార్య నిత్యానందరావు వెల్లడించారు.

## తమిళనాడు మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



తమిళనాడు మంత్రి విశ్వనాథన్‌కు అభినందనలు తెలుపుతున్న శ్రీగణేష్

**కంటోన్మెంట్, మే 24 ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పెరుమాళ్ విశ్వనాధన్‌ను ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని ప్రతిబింబించేలా మీ అనుభవ సారంతో తమిళనాడు ఉన్నత విద్యారంగం దేశానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డిలని కలిసి అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి శ్రీవారి దేవాలయంలో వసంతోత్సవం

**సైఫాబాద్, మే 24 ప్రభాతవార్త:** హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం నుంచి వసంత్సోవం కార్యక్రమాన్ని 4 రోజుల పాటు ఘనంగా జరుగుతుందని టిటిడి ఎఈవో యు.రమేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలు, సన్నాయి మేళాల నడుమ అంకురార్పణ కార్యక్రమంతో వసంత్సోవం ప్రారంభమవుతుందన్నారు. మంగళ, బుధ, గురువారాల్లో ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఊయ్యాల సేవ, 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు స్వామి వారికి తిరుచ్చి సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు తీర్థప్రసాదాలతోపాటు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని, ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రలు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## టవర్‌ను తొలగించాలంటూ బస్తీవాసుల నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న బస్తీవాసులు

**యూసుఫ్‌గూడ, మే 24 ప్రభాతవార్త :** అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొత్తూరు సీతయ్యనగర్ బస్తీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తిపై సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేస్తుండటంతో బస్తీవాసులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ఆ టవర్ నిర్మాణాన్ని ఆపివేయాలని కోరారు. స్థానికంగా ప్రైమరీ ప్రభుత్వ పాఠశాల ఉండటంతో చిన్నపిల్లలకు, వృద్ధులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రభావం ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై ఇప్పటికే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. అయితే సదరు ఇంటి నిర్మాణదారుడు ఇంటిపై టవర్‌ను ఏర్పాటు చేస్తుండగా స్థానికులు అతన్ని సంప్రదించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నాడని ఆ భవనానికే జీహెచ్ఎంసీ అనుమతులు లేవని ఆపై టవర్‌ని ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తున్నాడని వెంటనే అధికారులు తగిన విధంగా సమస్యను పరిశీలించి టవర్‌ను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

## చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

**నిజాంపేట్, మే 24, ప్రభాతవార్త :** బాచుపల్లి హిల్ కౌంటీ ఎదురుగా ఉన్న దాదాపు 11 ఎకరాల విస్తీర్ణంగల పత్తికుంట చెరువు పరిరక్షణకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 వరకు మంచినీటి చెరువుగా ఉన్న పత్తికుంట ప్రస్తుతం పూర్తిగా కాలుష్యానికి గురవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పాటైన అనంతరం పై ప్రాంతాల నుండి వచ్చే డ్రైనేజ్ నీటిని పైప్‌లైన్ ద్వారా చెరువులోకి మళ్లించడం వల్ల చెరువు పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. సంవత్సరం పొడవునా డ్రైనేజ్ నీరు చేరడం కారణంగా గుర్రపు డెక్క విపరీతంగా పెరిగి, దుర్వాసన వ్యాపిస్తూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. చెరువులోకి డ్రైనేజ్ నీరు చేరకుండా తక్షణమే పైప్‌లైన్‌ను రాజీవ్ గాంధీ నగర్ వరకు పొడిగించి మళ్లించాలని కోరారు. అలాగే చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు, పూడికతీత పనులు చేపట్టి చెరువును పునరుద్ధరించాలని సూచించారు. ఈ సమస్యపై సిఎంసీ నిజాంపేట్ సర్కిల్ అధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి వెంటనే చర్యలు ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు హనుమయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.



చెరువులో పేరుకుపోయిన మురుగు నీరు, చెత్త

# నిజమైన ఓటర్లకు న్యాయం జరిగేలా చూడాలి

### ఎస్ఐఆర్ జోనల్ ఇన్‌చార్జ్ మర్రి శశిధర్‌రెడ్డి



మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

**అత్తాపూర్ మే 24, ప్రభాతవార్త :** నిజమైన ఓటర్లకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్ఐఆర్ జోనల్ ఇన్‌చార్జ్ మర్రి శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. బిజెపి రాజేంద్రనగర్ అసెంబ్లీ బిఎల్ఏ 2 సమావేశం ఎస్ఐఆర్ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ లెవల్ ఆఫీసర్లు కీలక పాత్ర పోషిస్తారని ప్రతి ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి, ప్రతి ఓటరు వివరాలను వ్యక్తిగతంగా ధృవీకరిస్తారని ఇప్పటికే ఓటరుగా ఉన్నవారు తమ వివరాలను ధృవీకరించుకోవడానికి, కొత్త ఓటర్లు నమోదు కోసం ఫారం 6 నింపాలి. లేదంటే తొలగించడానికి, మార్పులు చేర్పులకోసం ప్రత్యేక ఫారాలను నింపాలని చర్చించారు. ఎస్ఐఆర్ జోనల్ ఇంచార్జ్ మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ...చివరిసారిగా 2002 - 2004 మధ్య చాలా రాష్ట్రాల్లో ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించిందని ఆ రివిజన్‌ను ఇప్పుడు పరిగణనలోకి తీసుకుని పోల్చిచూస్తారని చివరి ఇంటెన్సివ్ రివిజన్ జాబితాలో తమ పేర్లు లేనివారు లేదా వారి తల్లి దండ్రుల పేర్లు లేనివారు తమ భారత పౌరసత్వం, వయస్సును రుజువు చేసే పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించిన తర్వాత అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి.. విచారించి.. పరిష్కరిస్తారని అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారని నిజమైన ఓటర్లకు న్యాయం జరిగేలా బిజెపి నేతలు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు మల్లారెడ్డి, వై.శ్రీధర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, కొమురయ్య, బొక్క బాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, వనితరెడ్డి, సదానంద్, కడెం సుధాకర్, జయనంద్‌రెడ్డి, బాబురావు, నిఖిల్, విక్రమ్ చారి, రవి, వెంకటేష్, సందీప్ ముదిరాజ్, ఆనంద్, వెంకట్‌రెడ్డి, సురేందర్, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌గౌడ్, పద్మావతి, సరితరెడ్డి, అనురాధ, కవిత, సప్నారెడ్డి, అమర్, శ్రీనివాస్, విజయ్, శివ, షేక్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని

## ఇంటర్ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

**సంజీవరెడ్డినగర్, మే 24, ప్రభాతవార్త:** క్రీడల అభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడంలో తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం సనత్‌నగర్‌లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఇంటర్ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ పోటీలను ఆయన మాజీ శాసన మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యవంతులుగా ఉండటమే కాకుండా సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయన్నారు. ఇలాంటి పోటీలను వేదికగా చేసుకొని రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు రమేష్‌గౌడ్, రాజేష్‌ముదిరాజ్, జమీర్, బాలరాజ్ పాల్గొన్నారు.

## గూడెపు వెంకన్నకు నివాళి

**నిజాంపేట్, మే 24, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బాచుపల్లి కౌసల్యా కాలనీకి చెందిన గూడెపు రవీంద్రనాథ్ తండ్రి గూడెపు వెంకన్న ఇటీవల స్వర్గస్తులైన సందర్భంగా, ఆదివారం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన దశదిన కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గూడెపు వెంకన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపాన్ని తెలియజేశారు.

## కొత్త సంజీవరెడ్డికి నివాళులు

**కంటోన్మెంట్, మే 24 ప్రభాతవార్త:** ఆర్టీసీ మాజీ ఛైర్మన్, మహేంద్రహిల్స్ రవి కాలనీ సొసైటీ అధ్యక్షుడు కొత్త సంజీవరెడ్డి ప్రజలకు, కాలనీవాసులకు చేసిన సేవలు ఎనలేనివని తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌కో డైరెక్టర్ జి.సంపత్ కుమార్, ఇంటలిజెన్స్ ఐజీ శివకుమార్, కాలనీ ఉపాధ్యక్షులు కె.చంద్రమోహన్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రవి కాలనీలో నివాసం ఉంటున్న ఆర్టీసీ మాజీ ఛైర్మన్ కొత్త సంజీవరెడ్డి ఈ నెల గుండెపోటుతో మృతి చెందిన సందర్భంగా ఆదివారం రవి కాలనీ సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంతాపసభలో వారు పాల్గొని మహేంద్రహిల్స్‌లోని కాలనీల అభివృద్ధికి, రాష్ట్ర ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రవి కాలనీ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్‌రావ్, ప్రశాంతిలక్ష్మి, డాక్టర్ నవీన్, గోపాల్‌రెడ్డి, నర్సింగ్ రావ్, మల్లయ్య, సదానందరావ్, మోహన్‌రెడ్డి, సదాశివరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తసంజీవరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## బిఆర్ఎస్ హయాంలోనే పాతబస్తీ అభివృద్ధి

**చార్మినార్, మే 24 ప్రభాతవార్త :** పాతబస్తీ బిఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి సాధించిందని చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంఛార్జి అలీ బిన్ ఇబ్రహిం మస్కతి అన్నారు. అలీజాకోట్లలో చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి అలీ మస్కతి, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బిఆర్ఎస్ మాజీ ఇంఛార్జి పుస్తె శ్రీకాంత్, మాజీ సెట్విన్ ఛైర్మన్ మీర్ ఇనాయత్ అలీ బాక్రీలు కలిసి పాతబస్తీలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు గురించి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అలీ బిన్ ఇబ్రహిం మస్కతి మాట్లాడుతూ చార్మినార్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ నాయకులు మహ్మద్ ఇలియాస్ ఖురేషి, మల్లిఖార్జున్ యాదవ్, గోపీ గౌడ్ పాల్గొన్నారు.



చార్మినార్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఇంచార్జి అలీ మస్కతి



పోలీసులను సత్కరిస్తున్న సన్‌రైజర్స్ టీమ్ ప్రతినిధులు

## ఉప్పల్ పోలీసులకు సన్‌రైజర్స్ క్రీడాకారుల సత్కారం

**ఉప్పల్, మే 24 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌ల సందర్భంగా పటిష్టమైన పోలీస్ బందోబస్తు నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వహించిన పలువురు పోలీసు సిబ్బందిని సన్‌రైజర్స్ టీమ్ క్రీడాకారులు, అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఉప్పల్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్లు చిరంజీవి, మధు, హెడ్ కానిస్టేబుల్ జంగయ్యలను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ క్రికెటర్లు అభిషేక్ శర్మ పాల్గొని పోలీసుల సేవలను అభినందించారు. మ్యాచ్‌ల సందర్భంగా భారీ సంఖ్యలో ప్రేక్షకులు తరలివచ్చినప్పటికీ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, ఉప్పల్ జోన్ డిసిపి సురేష్, అడిషనల్ డిసిపి వెంకటరమణ, ఎసిపి వెంకట్ రెడ్డి, సిఐ వై.రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రశాంతంగా ముగిసిన యూపిఎస్‌సి పరీక్ష

**కంటోన్మెంట్, మే 24 ప్రభాతవార్త:** మల్కాజిగిరి పోలీస్ కమీషనరేట్ పరిధిలోని తిరుమలగిరి, పికెట్‌లలోని కే.వి.స్కూల్స్, బేగంపేట్ సికింద్రాబాద్ కళాశాలల్లో ఆదివారం నిర్వహించిన యూపిఎస్‌సీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన పరీక్ష కేంద్రాల వద్ద బారీ పోలీస్ బస్తును ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లే అభ్యర్థులకు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ప్రధాన కూడలీల వద్ద బారీ పోలీస్ బందో బస్తును ఏర్పాటు చేసినట్లు తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజ్ తెలిపారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**చార్మినార్, మే 24 ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి చంద్రశేఖర్ అన్నారు. శాలిబండ డివిజన్ పరిధిలోని అలియాబాద్, షంషేర్‌గంజ్ బస్తీలలో మంచి నీటి బోరింగులను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వాటర్ వర్క్స్ అధికారులకు చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు.

## నల్లకుంట శంకర్ మఠంలో మజ్జిగ పంపిణీ

**చిక్కడపల్లి, మే 24 (ప్రభాతవార్త) :** ప్రజలు సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని భారతీయ జనతా పార్టీ అధికార ప్రతినిధి గందె సుధాకర్ అన్నారు. ఆదివారం హ్యాపీ వాకర్స్ క్లబ్, అవోపా హైదరాబాద్, గాయత్రి మహిళా వాకర్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నల్లకుంట శంకర్ మఠంలో ఏర్పాటు చేసిన కొర్ర ఉప్మా, అంబలి, రాస్నా, మజ్జిగ పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వేసవికాలంలో దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛందసంస్థలు, క్లబ్‌లు సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి ఇలాంటి మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ ఏ.రామలింగేశ్వర రావు, ఏరియా 3 ఉపాధ్యక్షుడు ఎస్.మురళీకృష్ణ, గాయత్రీ మహిళా వాకర్స్ క్లబ్ ప్రధానకార్యదర్శి ఎస్.సుజాత, ఎన్.రాజశేఖర్, లింగాప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ జస్టిస్ చంద్రయ్యకు ఘన నివాళులు

**జూబ్లీహిల్స్, మే 24, ప్రభాతవార్త :** హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ చంద్రయ్యకు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో జస్టిస్ చంద్రయ్య మృతి నేపథ్యంలో సంతాపసభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపి ఈటెల రాజేందర్ హాజరై చంద్రయ్య చిత్రపటంవద్ద నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.



చంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈటెల రాజేందర్ తదితరులు

# మహేష్‌కుమార్‌గౌడ్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలి

**సైఫాబాద్, మే 24 ప్రభాతవార్త:** తెలంగాణ పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌పై ఒక ఛానల్ చేసిన అసత్య వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ హెచ్చరించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫ్రంట్ ఛైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ పలువురు బిసి నేతలతో కలిసి మాట్లాడుతూ రెండు రోజులుగా ఆ ఛానల్ మహేష్‌కుమార్‌గౌడ్‌పై చెడు ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు. 35 సంవత్సరాలుగా ఆయన కాంగ్రెస్ పార్టీకి విశేషమైన సేవలు అందిస్తూ వస్తున్నారని, గడిచిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు అనేక తప్పులు చేసినప్పటికి ఆ ఛానల్ యాజమాన్యం పట్టించుకోకుండా కేవలం బిసి సామాజిక వర్గానికి చెందిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను టార్గెట్ చేసిందని ఆరోపించారు. మహేష్‌కుమార్‌గౌడ్ తనకు ఉన్న 11 ఎకరాల భూమిని ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు దానం చేసిన చరిత్ర ఉందన్నారు. బిసి నేతలు అయిలీ వెంకన్న గౌడ్, అంబాల నారాయణగౌడ్, ఎస్.దుర్గయ్యగౌడ్, భైరీ శేఖర్ తదితరులు మాట్లాడుతూ మహేష్ కుమార్‌గౌడ్‌పై విమర్శలు చేయడం బిసిల ఆత్మగౌరవానికి సంబంధించిన విషయమని, ఆ ఛానల్ అసత్య ప్రచారాలను ఆపకపోతే సహించేది లేదని, ఛానల్ యాజమాన్యం తక్షణమే ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఛానల్ భవనాన్ని ముట్టడించి భౌతికంగా దాడులు చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు.




మాట్లాడుతున్న బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్


## భగీరథ్ కేసులో బండి సంజయ్‌కు సంబంధం లేదు



మాట్లాడుతున్న కుమార్‌చౌదరి

**సైఫాబాద్, మే 24 ప్రభాతవార్త:** బండి భగీరథ్ కేసు విషయంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఎలాంటి సంబంధం లేదని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గొంటి కుమార్ చౌదరి స్పష్టం చేశారు. బండి భగీరథ్ కేసు విచారణ దశ కోర్టు పరిధిలో ఉందని, దీన్ని రాజకీయం చేయడం సరికాదని, ఈవిషయాన్ని కోర్టు, రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని ఆయన చెప్పారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ చిన్నతనం నుంచి ఎంతో కష్టపడి అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి స్థాయికి ఎదిగారని దీన్ని జీర్ణించుకోలేని బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కుట్ర పన్నుతుందని, మరి కొందరు వ్యక్తులు రకరకాల వ్యాఖ్యలు చేస్తూ ఆయన్ని మానసికంగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. దేశంలో, రాష్ట్రంలో చట్టాలు, కోర్టులు ఉన్నాయని, వాటి పని అవి చేసుకుంటూ పోతాయని, ఈ విషయాలు తెలిసి కూడా కొంత మంది కావాలనే బండి సంజయ్ ప్రతిష్ట దెబ్బ తీయడానికి ఆరోపణలు చేశారని, ఆయన్ని అభాసుపాలు చేసే విధంగా పన్నాగాలు పన్నారని ఆరోపించారు. ఇది న్యాయం కాదన్నారు. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదన్నారు. రాజకీయ పార్టీలు కుటుంబాల విషయాల్లో జోక్యం చేసుకుని రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు.

## కలుషిత నీటి సరఫరా.. ఇబ్బందుల్లో ప్రజలు



పర్వత్‌నగర్‌లో మంచి నీటి పైప్‌లైన్‌లో సరఫరా అయిన కలుషిత నీరు

**యూసుఫ్‌గూడ, మే 24 ప్రభాతవార్త :** అసలే ఎండా కాలం తాగేందుకు గుక్కెడు నీరు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే మంచి నీటి పైపుల ద్వారా సరఫరా అయ్యే నీరు కాస్త కలుషితం కావడంతో ప్రజలు మరింత ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గాయిత్రినగర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ బస్తీలో రెండు రోజులుగా పైప్‌లైన్ ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుంది. తాగేందుకు స్థానికులు నీటిని పట్టుకోగా దుర్వాసన వస్తుండడంతో వెంటనే ఈ విషయాన్ని వాటర్‌బోర్డు సీఎమ్‌డీ అశోక్‌రెడ్డికి, జీఎమ్ హరిశంకర్‌కు, డీజీఎమ్ త్రినాథ్‌కు, మేనేజర్ అన్విత్‌తో మాట్లాడటం జరిగిందని లోక్‌సత్తా పార్టీ నేత వంశీప్రసాద్ తెలిపారు. అయితే మేనేజర్ సమస్యఉన్న ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారని, అయినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదన్నారు. బస్తీలో నీటి సరఫరాలో అంతరాయం తీవ్రంగానే ఉందని నామమాత్రంగా వాటర్ ట్యాంకర్లను పంపిస్తున్నప్పటికీ ప్రజలకు సరైన విధంగా నీరు సరిపడా సరఫరా కావడం లేదని మరికొంత సమయాన్ని పెంచి నీటి సరఫరా చేయాలని కోరారు.

## బాటసారులకు మజ్జిగ పంపిణీ..

**జీడిమెట్ల, మే 24, ప్రభాతవార్త :** స్వర్గీయ సుశీలమ్మ జ్ఞాపకార్థం అన్నదమ్ములు కలిసి ఎండలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో తమ వంతు సహాయంగా మజ్జిగ పంపిణీని చేపట్టారు. వారి కుమారుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఎండలు తగ్గే వరకు ప్రతిరోజూ వివిధ కూడళ్లు, చౌరస్తాల్లో ప్రజలకు మజ్జిగ అందించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఆదివారం సూరారంకాలనీ హోమ్ జెండా వద్ద, సూరారం చౌరస్తా సహ పలు ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్లాస్టిక్ గ్లాసులకు బదులుగా పేపర్ గ్లాసులను వినియోగించారు. ఈ కార్యక్రమంలో ఆత్నూర్ మండల మాజీ ఎంపీటీసీ వీరేశం, సూరారం గ్రామ మాజీ వార్డ్ మెంబర్ బైండ్ల నరసింహ పాల్గొన్నారు. అప్పటి గ్రామపంచాయతీలో సర్పంచ్‌తో పాటు ఎనిమిది మంది సభ్యుల్లో ప్రస్తుతం జీవించి ఉన్న ఏకైక వ్యక్తి నరసింహ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## ఇంకుడు గుంతలతో నీటి సంరక్షణ : బిక్షపతి యాదవ్

**నిజాంపేట్, మే 24, ప్రభాతవార్త :** వర్షపు నీరు ప్రకృతి మానవాళికి అందించిన అమూల్యమైన వరమని, ప్రతి నీటి చుక్కను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ బిక్షపతి యాదవ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల ప్రజలు తీవ్ర నీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వేసవి కాలంలో తాగునీటి కోసం ప్రజలు వాటర్ ట్యాంకర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వర్షాకాలంలో వృథాగా మురుగు కాలువల్లో కలిసిపోతున్న నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి పంపిస్తే భవిష్యత్తులో నీటి కొరతను కొంతవరకు తగ్గించవచ్చని తెలిపారు. ఇంటి ఆవరణలో లేదా బోరు సమీపంలో ఇంకుడు గుంతలు నిర్మించి పైకప్పు నుంచి వచ్చే వర్షపు నీటిని వాటిలోకి మళ్లించాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఈ గుంతలను నిర్మించవచ్చని, ప్రభుత్వం కూడా ఇందుకు సబ్సిడీలు అందిస్తోందన్నారు. ప్రజలు నీటి పొదుపుపై అవగాహన పెంచుకుని ప్రతి నీటి చుక్కను సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బును నీళ్లలా ఖర్చు చేయడం మాత్రమే కాదు, ఇకపై నీళ్లను డబ్బులా పొదుపు చేయడం కూడా నేర్చుకోవాలి అని బిక్షపతి యాదవ్ అన్నారు. తమ ఎల్జీఎఫ్ సంస్థ ద్వారా ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## పేదలకు దుస్తులు పంపిణీ

**అఫ్జల్‌గంజ్, మే 24 ప్రభాతవార్త:** మారుతున్న కాలంలో పూర్వీకులను గుర్తు పెట్టుకుని దానధర్మాలు చేయడం ఎంతో సంతోషదాయకమని మాజీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ తండ్రి భీమ్‌సేన్ జైస్వాల్ జ్ఞాపకార్థం గౌలిగూడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని పేదలకు దుస్తువులను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇచ్చిన జన్మతో ప్రతి ఒకరు సమాజంలో ఎంతోపేరు ప్రఖ్యాతలు సంపాందిస్తారన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవాన్ని కాపాడినప్పుడే జన్మకు సార్థకత ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు రాజుయాదవ్, రవిజైస్వాల్, అశోక్ జైస్వాల్, అనిల్‌యాదవ్, సందీప్‌జైన్, అమిత్, రోషన్, సాయిరామ్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను మోసం చేస్తే మరో ఉద్యమం తప్పదు

**గోషామహల్, మే 24 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ప్రతి నెల 25 వేల పెన్షన్‌ను ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్, తెలంగాణ ఉద్యమకారుడు ఆర్వీ మహేందర్‌కుమార్ డిమాండ్ చేశారు. కోఠిలో ఏర్పాటు చేసిన ఉద్యమ కారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటవల సీనియర్ నాయకులు మాజీ రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు ఆధ్వర్యంలో 5మ్యాన్ కమిటి ఏర్పాటు చేశారు. ఐదుగురు కమిటి సభ్యుల కమిటి ఇప్పటి వరకు ఎలాంటి కార్యచరణ మొదలు పెట్టలేదన్నారు. 33 జిల్లాల ఈ కమిటి సభ్యులు వెళ్లి జిల్లాల వారిగా సమాచారం సేకరిస్తామంటున్నారు. ఎప్పటిలోగా పూర్తిచేసి ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం, నెల 25వేల పెన్షన్ ఇస్తారని అన్నారు. నిజంగా ఉద్యమకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏమన్నా చేయాలనే ఉద్దేశ్యం ఉందా, లేక కాలయాపన కోసం కమిటి వేశారని ప్రశ్నించారు. వీలైనంత తొందరలో మాజీ రాజ్యసభ్యులు కె.కేశవరావు ఆధ్వర్యంలో వేసిన 5గురు సభ్యులు తెలంగాణ వ్యాప్తంగా తిరిగి ఉద్యమకారుల జాబితాను రూపొందించి న్యాయం జరిగేలా చూడాలన్నారు. లేనిపక్షంలో ఉద్యమకారులతో కలిసి పెద్ద ఎత్తున్న ఆందోళనచేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యమకారులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఉద్యమకారుడు ఆర్వీ మహేందర్‌కుమార్

## లక్ష్మీదేవిపల్లికి గ్రీన్ సిగ్నల్‌పై హర్షం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సర్పంచ్ కృష్ణ

**నందిగామ, మే 24, ప్రభాతవార్త :** ఎన్నో ఏళ్ల నాటి నుండి నిరీక్షిస్తున్న లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పోరాటం పలించినట్లైంది. ఎమ్మెల్యే పోరాట పటిమకు మెచ్చి సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో షాద్‌నగర్ నియోజకవర్గం ప్రజలు ఆనందంతో సంబరాలు జరుపుకుంటున్నారు. ఈ శుభ సందర్భంగా నంది గామ సర్పంచ్ కొమ్ము కృష్ణ ప్రగతికి కేరాఫ్ అడ్రస్ ఎమ్మెల్యేను సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యేను అభినందించిన వారిలో చేగూరు సర్పంచ్ మంకాల శ్రీశైలం, నాయకులు ఎర్రగారి రమేష్, తడకల జంగయ్య తదితరులు ఉన్నారు.

## హామీ ఇచ్చే వరకూ పోరాటం ఆగదు

**కుల్కచర్ల, మే 24, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వీవోఏల సమస్యలను పరిష్కరించేతవరకు పోరాడతామని అన్నారు. అదివారం మండల కేంద్రంలోని వీవోఎలు 7వ రోజు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...తమ నాయమైన డిమాండ్లను ప్రభుత్వం



సమ్మెలో పాల్గొన్న వివొఏలు

పరిష్కరించాలన్నారు. వీవోఏలకు కనీస 20వేల వేతనం అందించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెట్ఆర్ పాలసి వర్తింప జేయాలని, ఆర్హులైన వీవోఏలను సిసిలుగా పదోన్నతులు కల్పించాలని, వీవోఏలకు సాధారణ, ఆరోగ్య బీమా 20 లక్షలు కల్పించాలని, ప్రభుత్వం తమతో ఎకువగా ఫోన్‌లతో యాప్‌లతో పనిచేయిసుందని, దీనికిగాను ట్యాబ్‌లు ఇవ్వాలని, 58జీవోను సవరించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున్న అందోళనచేస్తామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత స్థానాలకు ఎదగటం అభినందనీయం

**యాచారం,మే 24, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని గుంగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల 1995-96 విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యాక్రమాన్ని ఎస్ఆర్‌కే కన్వెన్షన్ హాల్ బొంగ్లుర్ ఎక్స్ రోడ్డులో ఆదివార ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వారి యొక్క పరిచయము, వారు చేయుచున్న పని, వారి యొక్క గతస్మృతులను పంచుకున్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల



సమ్మేళనం కార్యక్రమం చేయించడంతో సంతోషాన్ని ఇస్తోందన్నారు. 30 సంవత్సరాల క్రితం చదువుకున్న మీరు వివిధ ఉద్యోగ ఉపా ధ్యాయ ఇతర వృత్తులలో స్థిరపడి మంచి స్థాయిలో ఉన్నారని అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్, ఆంజనేయులు, నర్సింహారెడ్డి, అనంతరెడ్డి, వెంకట మహాలక్ష్మి ్మ, తదితరులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న బిజెపి నాయకులు

**షాద్‌నగర్, మే 24, ప్రభాతవార్త :** అకాల వర్షం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, బిజెపి సీనియర్ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి రైతుల సమస్యలను పరిశీలించారు. మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు భారీ ఆర్థిక నష్టాన్ని ఎదు ర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన విష్ణువర్ధన్ రెడ్డి రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే వెంటనే కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. అలాగే పంట నష్టానికి తగిన పరిహారం అందించి, రైతులను ఇబ్బందులకు గురి కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ సెక్రటరీ తో విష్ణువర్ధన్ రెడ్డి గారు ఫోన్ లో మాట్లాడి రైతుల పట్ల ప్రభుత్వం నిరక్ష ్యంగా వ్యవహరించకూడదని ఆయన అన్నారు. రైతులకు నష్టం జరిగితే రైతుల పక్షాన బిజెపి పార్టీ అండగా ఉంటూ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. దాన్యం తడవకుండా షెడ్‌లు ఎందుకు ఏర్పాటు చేయలేదు అని సెక్రటరీ గారిని ఫోన్ లో నిలదీయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి ఇస్నాతి శ్రీనివాస్, కౌన్సిలర్ ప్యాట అశోక్, వంశీకృష్ణ, చేగు సుధాకర్ అప్ప, సర్పంచ్ బోయ అశోక్, సర్పంచ్ మూడవత్ రాజు నాయక్, అత్తాపురం మహేందర్ రెడ్డి, క్యామ మహేష్, అనిల్ కుమార్ గౌడ్, కిట్టు యాదవ్, శ్రావణ్, అందెల సందీప్, ప్రశాంత్, నడికూడ రవి యాదవ్, గుండ్ల అశోక్, కృష్ణ, నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## మాతో సహా ఎవరు తప్పుచేసినా ప్రశ్నించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పాలమూరు ప్రాజెక్టు విషయంలో శంకర్ తో కలిసి సీఎంను కలవడం, మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డిని కలవడం, అనుకున్నది సాధించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. బోర్లు వేసిన చుక్క నీరు రాని స్థితిలో ఉన్న పాలమూరుకు ప్రాజెక్టు అవసరం ఎంతగానో ఉందని అన్నారు. ప్రస్తుతం రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలలో కలెక్టరేట్లలో సమావేశాల అనంతరం చర్చించి ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేస్తామని స్పష్టం చేశారు. భూసేకరణ నిర్వహించి పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేస్తామని అన్నారు. ఈ విషయంలో వీర్లపల్లి శంకర్ పట్టుదలతో ఉన్నాడని, సీఎం కూడా దీనిని వదిలిపెట్టడని ఆయన స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతి లేకుండా, భూసేకరణ లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారని గత ప్రభుత్వం పై విరుచుకు పడ్డారు. కాళేశ్వరం కోట్లు ఖర్చుపెట్టిన గత ప్రభుత్వం పాలమూరును ఎందుకు విస్మరించిందో యువత ప్రశ్నించి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. జనగణనతో కొత్త వెలుగు.. జనగణన, కులగణన కార్యక్రమాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అన్ని విధాలుగా న్యాయం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ప్రజల కోసం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంటే పింకు మీడియా తమపై దుష్ప్రచారాలు చేస్తుందని, ఇలాంటివి నమ్మవద్దని శిక్షించారు. గతంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరిగిందని, ఈవిడత ప్రతి నియోజకవర్గానికి మరో రెండు వేల ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాలను గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తో పాటు మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అందమోహన్, చెంది తిరుపతి రెడ్డి, పి.రఘు, కృష్ణారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైద్యం వికటించి బాలుడి బలి

(మొదటి పేజీ తరువాయి)

అక్కడ అందుబాటులో ఉన్న వ్యక్తులతో వైద్యం చేయించింది. శనివారం రాత్రంతా వారు ఇచ్చిన వైద్యం పనిచేయక పోవడం కారణంగా ఆదివారం తెల్లవారు జామున బాలుడి పరిస్థితి అత్యంత విషమంగా మారింది. పరిస్థితి చేతులు దాటిపోవడంతో బాలాజి ఆసుపత్రి సిబ్బంది చేతులెత్తేసారు. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని పట్టణంలోని గాయత్రి ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు బాలుడి పల్స్ రేటు దారుణంగా పడిపోయిందని గుర్తించారు. అత్యవసరంగా మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు. మార్గమధ్యలోనే అనంత లోకాలకు..సమయం మించిపోతుండటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతూ బాలుడిని హైదరాబాద్ తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే దురదృష్టవశాత్తూ హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలోనే బాలుడు మనీశ్వర్ ప్రాణాలు విడిచాడు. కొడుకు మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కేసు పెడితే పోస్టు మార్టం చేస్తారనే భయంతో...ఆసుపత్రి వైద్యుల నిరక్ష్యం కారణంగా తమ కుమారుడు చనిపోయాడని గ్రహించిన ఆ తల్లితండ్రులు తల్లడిల్లిపోయారు. ఆదివారం ఉదయం ఆసుపత్రి ముందు ఆందోళన నిర్వహించి కేసు పెడదామని అనుకున్న వారికి కేసు నమోదైతే బాలుడి మృత దేహాన్ని పోస్టు మార్టం చేస్తారని ఆవేదన చెందారు. దేవుడా ఇదేమి ఖర్మ అనుకుంటూ తమ కుమారుడి మృత దేహాన్ని తీసుకుని స్వగ్రామానికి వెళ్ళిపోయారు. అధికారుల పర్యవేక్షణ శూన్యం...గతంలోనూ విమర్శలు!పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో క్వాలిఫైడ్ డాక్టర్లు కాకుండా, నర్సింగ్ లేదా ఇతర చిన్న కోర్సులు చదివిన తెలిసి తెలియని వ్యక్తులతో ఇష్టమొచ్చినట్లు వైద్యం చేయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఈ బాలాజి ఆసుపత్రిలో గతంలో కూడా ఇలాంటి వైద్య నిరక్ష్య ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పదే పదే జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. అధికారుల మామూళ్ల కక్కుర్తి వల్లే తనిఖీలు జరగడం లేదని, ఫలితంగానే అమాయక ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సదరు ఆసుపత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ పనులు ప్రారంభం

**జిల్లెడు చౌదరి గూడెం, మే 24, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగుడా మండలంలోని ఎదిర గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలలోని పేద ప్రజలకు పక్కా ఇల్లు కావాలని ఉద్దేశంతో ఇందిరా ఇళ్లను మంజూరు చేసిందని అన్నారు.

# ఆందోళన అవసరం లేదు

### చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**పెద్దేముల్, మే 24, ప్రభాతవార్త:** గన్ని బ్యాగుల, లారీల కొరత లేదని, రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని, ప్రతి చివరి గింజ వరకు దాన్యం కొనుగోలు చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి రైతులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కొంత గన్ని బ్యాగుల, లారీల కొరత వల్ల తమ ధాన్యాన్ని తూకం చేయడంలేదని, వర్షం పడితే అపార నష్టం వాటిల్లె ప్రమాదం ఉందని రైతులు విన్నవించగా ఎమ్మెల్యేపై విధంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గన్ని బ్యాగుల, లారీల కొరత లేకుండా చూడాలని సంబందిత అధికారులకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. రైతు దేశానికి వెన్నముఖ అని, వారి సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా కల్పించారు. రైతులు ఇబ్బందులు పడకుండా దాన్యం కొనుగోళ్ళను మరింత వేగవంతం చేయాలని తాండూరు డిసిఎంఎస్ ఇంచార్జ్ సలాంపాషను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి మార్కెట్ కమిటి చైర్మెన్ అంజయ్య, వైస్‌చైర్మెన్ ఎస్.నారాయన్‌రెడ్డి, టీపీసీసీ కన్వీనర్ యండి.రియాజ్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యాక్షులు శోభారాణి, మండల పార్టీ అధ్యక్షులు రుద్రారం మహిపాల్‌రెడ్డి, నాయకులు ఉప్పరి మల్లేశం, జి.క్రిష్ణరెడ్డి, కోటపల్లి బందెన్న, పి.ప్రకాశం, బోయిని నారాయణ, మైపూస్, తాండూరు డిఎస్‌పి నర్సింగ్ యాదయ్య, సీఐ ప్రవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఆత్మహత్య

**మొయినాబాద్, మే 24, ప్రభాతవార్త :** కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హేతుబార్పల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హేతుబార్పల్లి గ్రామానికి చెందిన బుర్ర మల్లేష్ (31) వాచ్‌మన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం వికారాబాద్ జిల్లా మాదారం గ్రామానికి చెందిన మమతతో మల్లేష్‌కు వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవల కుటుంబంలో చిన్నపాటి గొడవ జరగడంతో మల్లేష్ తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం తన పొలంలో ఉన్న చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మొయినాబాద్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మల్లేష్ తల్లి బుర్ర భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పంపిణీకి 300 బ్యాగుల జనుము విత్తనాలు

**జిల్లెడు చౌదరిగూడ, మే 24, ప్రభాతవార్త :** జిల్లెడు చౌదరి గూడ మండలంలోని రైతులకు జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజేందం రెడ్డి తెలిపారు. మండలానికి మొదటి విడతలో 300 బ్యాగుల విత్తనాలు వచ్చాయని తెలిపారు. మండలంలోని మూడు ఆగ్రోస్ రైతుసేవా కేంద్రాల ద్వారా వీటిని పంపిణీ ఆయన పెర్కొన్నారు. ఒకొక్క బ్యాగ్ 40 కేజీలు ఉంటుందని, 40 కేజీల బ్యాగు పూర్తి ధర రూ.6,220 కాగా ప్రభుత్వం దీన్ని 50 సబ్సిడీతో 3110 రూపాయలకు అందిస్తుందని తెలిపారు. ఆసక్తిగల రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకంతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి జనుము విత్తనాలు పొందాలని పెర్కొన్నారు.

## 50శాతం రాయితీతో ఇస్తున్నాం...

**దుద్యాల్, మే 24, ప్రభాతవార్త:** పంటల సాగులో అధిక దిగుబడినిచ్చే పచ్చిరొట్ట ఎరువుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి నాగరాజు సూచించారు. 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువు అయిన జనుము విత్తనాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పచ్చిరొట్టను ఎంచుకోవడం వలన సాగులో కలుపు మొక్కల నివారణ, జింక్ లోపం, రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుందని వివరించారు. పొలాల్లో పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు చల్లుకొని 45 రోజులకు దమ్ము చేసుకోవాలని సూచించారు. 40 కిలోల జనుము సబ్సిడీ రూపంలో రూ.3,110/ కు విక్రయించనున్నట్లు వెల్లడించారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్ లతో సంబంధిత క్లస్టర్ ఎఈవోను సంప్రదించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని అధికదిగుబడులు పొందాలన్నారు.

## ఎన్నారంలో వృద్ధుడి ఆత్మహత్య

**కోట్‌పల్లి, మే 24, ప్రభాతవార్త:** ఎన్నారం గ్రామ శివారులో ఓ వ్యక్తి ఉరి వేసుకోని మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల పరిధిలోని ఎన్నారం గ్రామంలో చోటు చేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. ఎన్నారం గ్రామానికి చెందిన బంటు పెద్ద నర్సిములు (72) ఈనెల 16న మధ్యాహ్నం నుండి కనబడటం లేదని అతని కోడలు బంటు మల్లమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు 20న మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. 23 సాయంత్రం ఆరు గంటల సమయంలో బంటు పెద్ద నర్సిములు గ్రామ శివారులో ఉరి వేసుకోని చనిపోయిన్నాడని పోలీసులకు సమాచారం అందింది. 24న పంచనామా నిర్వహించి మృత దేహన్ని వికారాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై శైలజ పేర్కొన్నారు.



పార్క్ ప్యాలెస్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఎమ్మెల్యే తదితరులు

## షాద్ నగర్‌లో పార్క్ ప్యాలెస్

**షాద్‌నగర్, మే 24, ప్రభాతవార్త :** హైదరాబాద్ తదితర పెద్ద ప్రాంతాలలో ఉండాల్సిన సౌకర్యాలతో ఉన్నటువంటి అతి పెద్ద హోటల్ వ్యవస్థను అన్ని సదుపాయాలతో సౌకర్యాలతో షాద్ నగర్ పట్టణంలో కూడా ఇంత పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇలాంటి హోటల్స్ ఏర్పాటు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన పార్క్ ప్యాలెస్ అత్యధిక హోటల్ అదేవిధంగా పిల్లలకు కావలసిన గేమ్స్, తదితర టీ ప్యాలెస్ బేకర్ సౌకర్యాలను మంత్రి వాకిటి శ్రీహరి అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే ముఖ్య అతిథి వీర్లపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అరేబియన్ ఫుడ్, అదేవిధంగా అత్యంత ప్రాచీన ఆహారం, లభించేలా అతిపెద్ద సౌకర్యాలతో రెస్టారెంట్ ఏర్పాటు చేయడం అదేవిధంగా పిల్లలకు పెద్ద ఎత్తున గేమ్స్ ప్రపంచాన్ని పరిచయం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఆర్థికంగా ఖర్చులకు వెలగడకుండా ప్రజలకు ఎంతో చక్కని సౌకర్యాలను ఏర్పాటు చేసి ఎంతో పెద్ద గొప్ప హోటల్లో లభించే అన్ని సౌకర్యాలను ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

## అందరి సహకారంతోనే ప్రాజెక్టులకు నిధులు

**షాద్‌నగర్ టౌన్, మే 24, ప్రభాతవార్త :** తాడు, బొంగరం లేని పాలమూరు ప్రాజెక్టు తొంబై శాతం పూర్తయిందని తోకా మూతి లేని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ చెప్పున్నాడు.. పనులన్నీ అస్తవ్యస్తంగా ఉన్నాయి.. అడ్డగోలుగా నిధులు మింగేశారు.. డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ తవ్వలేదు.. భూసేకరణ జరగలేదు.. ఇంత పచ్చి అబద్ధాలు ఎలా ఆడతారో అర్థం కావడం లేదు.. అంటూ బీఆర్ఎస్ నాయకుల తీరుపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి, మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, వాకటి శ్రీహరి, ఇలాంటి వాళ్ళని కలిసి రిజర్వాయర్ కోసం పట్టుబట్టడం జరిగింది అన్నారు. ఈ విషయంలో తనతో పాటు పోరాటం చేసి సాధనకు కృషి చేసిన మంత్రి వాకిటి శ్రీధర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కూడా ఈ వ్యవహారంలో ముఖ్య భూమిక పోషించారని అన్నారు. అందరి సహకారంతో ఈ రిజర్వాయర్ పూర్తయిందని, ఈ సందర్భంగా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని వెల్లడించారు.



మాట్లాడుతున్న మంత్రి వాకిట శ్రీహరి

## లక్ష్మీదేవి పల్లి కోసం ఎమ్మెల్యే కృషి భేష్ మంత్రి వాకిటి శ్రీహరి


**షాద్‌నగర్ టౌన్, మే 24, ప్రభాతవార్త :** మీరు స్వాతిముత్యం సినిమా చూశారా.. అందులో కమల్ హాసన్ ఉద్యోగం కోసం పట్టుబట్టి జెవి సోమయాజులు ఎక్కడికి వెళితే అక్కడికి వెళ్లి ఇబ్బంది పెడుతుంటాడు.. అలాగే లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కోసం వీర్లపల్లి శంకర్ కూడా మమ్మల్ని అలాగే ఇబ్బంది పెట్టాడు.. మొదట ఏమిటి పిచ్చి పట్టినట్లు ఇలా వెంటపడ్డాడు అనుకున్నాం.. కానీ ఇది రిజర్వాయర్ పూర్వపరాలు తెలుసుకున్నాక ఇందులో భాగస్వామ్యం అయినందుకు గర్వపడుతున్నాం.. అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మీడియా సమావేశంలో కాసేపు ఆయన సరదాగా వీర్లపల్లి శంకర్ పై ఇలాంటి వాక్యలు చేసి నవ్వులు పూయించారు. అయితే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ విషయంలో ఎంత కమిట్మెంట్‌తో ఉన్నాడో ఆయన వివరించారు. ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రులందరినీ ఒక వేదిక మీదికి తెచ్చి తాను అనుకున్నది సాధించాడని అభినందించారు. తనకు ఒక్క లక్ష్మీదేవిపల్లి ఇస్తే చాలు.. మరేమీ అక్కరలేదు.. అంటూ పట్టు పట్టాడని గుర్తు చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే పట్టువదలని విక్రమార్కుడిలా పని చేస్తాడని పేర్కొన్నారు.

**లక్ష్మీదేవి పల్లి సాధనలో మీడియా కీలక పాత్ర..**

అక్షరపోరుతో అభ్యుదయం తెచ్చారు.. ఆది నుంచి అంతం వరకు లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ కోసం పోరాడారు.. జలా శయ సాధనే ఆశయంగా ముందుకు సాగి నాయకులను అప్రమత్తం చేసి రిజర్వాయర్ సాధించిన ఘనత పాత్రికేయులకు దక్కుతుందని మంత్రి వాకిట శ్రీహరి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాత్రికేయులను అభినందించారు.

**సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం**

షాద్ నగర్ నియోజకవర్గ చరిత్రలో ఇదొక మైలురాయి అంశమని కనివిని ఎరుగని రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర మంత్రులు జిల్లా ఎమ్మెల్యేల కృషి ప్రశంసనీయమని కుందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు, పార్లమెంటరీ నాయకుడు పురుషో త్తం రెడ్డి



ప్రశంసించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాలాభిషేకం పెద్ద ఎత్తున చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ ఛైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, కౌన్సిలర్ పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్, బచ్చలి నరేష్, దిలీప్, బాలరాజు గౌడ్, శ్రీనివాస్, సాదిక్, ముబారక్ అలీ ఖాన్, సోలిపూర్ అనీల్, జయప్రకాష్ , నీరటి వాసు, అర్జున్ లక్ష్మణ్ మంగ మధు, ప్రదీప్ ముదిరాజ్, మనీష్ తదితరులు మాట్లాడారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు కోగూరి పురుషోత్తం రెడ్డి, నాళమోని శ్రీధర్, రాయికల్ శ్రీనువాస్, సుదర్శన్ గౌడ్ నాయకులు బాలరాజ్ గౌడ్, జితేందర్ రెడ్డి, జాకారం శేఖర్ జాక్ నాయకులు వెంకట్రామ్ రెడ్డి కరుణాకర్, జనార్దన్ సర్పంచులు శ్రీను నాయక్, గోపాల్ నాయక్, కనకమామిడి అంజన్, రమేష్, రాజకుమార్, అమర్ నాథ్ రెడ్డి, యాదయ్య తదితరులు హాజరయ్యారు.



ఆర్థిక సహాయం చేస్తున్న నాయకులు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**తలకొండపల్లి మే 24, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పోతుగంటి చంద్రయ్య అనారోగ్యానికి గురై మృతి చెందాడు. మృతుని కుటుంబానికి శతాబ్ది టౌన్షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగతంగా 4వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్త అయిన చంద్రయ్య మృతి చెందడంతో వ్యక్తిగతంగా పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి ఆవంచ నర్సింహారెడ్డి గ్రామస్తులు గణేష్ ఇటమోని మల్లేష్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు తలకొండపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రయ్య మృతి చెందడంతో ఆదివారం నాడు మృతుని కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ లలిత జోతయ్య, ఉపసర్పంచ్ కోటీశ్వరులు పరామర్శించారు. అనంతరం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి 3వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెరుమల లలిత జోత య్య, ఉప సర్పంచ్ కోటీశ్వర్ వార్డు సభ్యులు పోతుగంటి కుమార్, వెంకటేష్, నాయకులు నరసింహ శ్రీశైలం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## 5 నుంచి ప్రొద్దుతిరుగుడు కొనుగోళ్లు

**తలకొండపల్లి, మే 24, ప్రభాతవార్త:** ప్రొద్దుతిరుగుడు ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడంపై సింగిల్ విండో చైర్మన్ గట్ల కేశవ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 5 వ తేదీ నుంచి ప్రొద్దుతిరుగుడు కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో ఎంపీ మల్లు రవి, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డికి విన్నవించడంతో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ కేశవరెడ్డి

ప్రొద్దుతిరుగుడు కొనుగోలుకు ఆమోదం తెలపడం గొప్ప విషయమన్నారు. రైతుల కోసం 20 రోజులుగా ప్రొద్దుతిరుగుడు కొనుగోలు కోసం పడ్డ కష్టం ఫలించిందని తెలిపారు. రైతు శ్రేయస్సు కోసమే పని చేస్తున్నానని, రైతన్నలకు మేలు చేయడం లక్ష ్యమని కేశవరెడ్డి పేర్కొన్నారు. పడకల్ గ్రామంలో ప్రొద్దుతిరుగుడు కొనుగోలు కొనసాగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి గట్ల కేశవరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

## టియూఎఫ్‌సి జిల్లా ఉపాధ్యక్షుడిగా రామకృష్ణ

**ఆమనగల్లు, మే24, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమ ఫోరం కమిటీలో టి.రామకృష్ణకు సముచిత స్థానం లభించింది. రంగారెడ్డి జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటూ నియామకపు పత్రం జారీ చేశారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వోరగంటి ఆనంద్ చేతుల మీదుగా ఆదివారం రామకృష్ణ నియాకపుపత్రం అందుకున్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన తల్లోజు రామకృష్ణ మలివిడత తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి దశాబ్దన్నర కాలంగా ఉద్యమ పోరాటానికి వెన్నెముకగా నిలిచారు.



నియామక పత్రం అందుకుంటున్న రామకృష్ణ

అన్ని వర్గాలను ఏకతాటి మీదికి తీసుకువచ్చి మండలంలో ఉద్యమ ఉధృతికి ఒకరిగా నిలిచాడు. ఈసంధర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ఫోరం జిల్లా కమిటీలో సముచిత స్థానం కల్పించడం ఆనందంగా ఉందని, తన నియామకమునకు సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంటం యాదవరెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తిస్తుండడం హర్షించదగినదని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బిజెపి నేతలు

## బస్సు యాత్ర విజయవంతం చేయాలి

**కుల్కచర్ల, మే, 24 ప్రభాతవార్త :** రైతన్నకు భరోసాగా ఈనెల 25న బిజెపి రాష్ట్ర అధ్యక్షునితో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు కుల్కచర్ల మండలో చేపట్టనున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాదరావు కోరారు. అదివారం మండల కేంద్రంలోని పివిర్ ఫంక్షన్ హల్‌లో మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి బస్సు యాత్రు రైతులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న తరలి రావాలని కోరారు. సమావేశంలో చేవెళ్ల మాజి ఎమ్మెల్యే రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ శ్రీశైం యాదవ్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెబంర్ ప్రభాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యదర్శి వడ్డె చంద్రయ్య, సర్పంచ్ వార్వల ఆంజిలయ్య, మాహిళ మోర్చా ఉపాధక్ష్యురాలు సౌమ్యరెడ్డి, టెలికాం ఆద్వజర్ వెంకటయ్య గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ విజయ్ కుమార్, సినియర్ నాయకులు ఆంజిలయ్య, బాలకృష్ణ రెడ్డి, మల్లేష్, హనుమంతు, మహిపాల్ యాదవ్, హరి తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సర్పంచ్ భరోసా

**తలకొండపల్లి, మే 24, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగ రావు పల్లి గ్రామానికి చెందిన పులిగంటి పెద్ద పెంటయ్య ఈ నెల 17న అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఆదివారం నాడు గ్రామ సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని భార్య ఎల్లమ్మను ఓదార్చారు. అనంతరం వ్యక్తిగతంగా వారి కుటుంబ సభ్యులకు 10,000 రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతోపాటు గ్రామానికి చెందిన జగన్మోహన్ రెడ్డి వేయి రూపాయలు చొప్పున మొత్తం 11 వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి గోపాల్ రెడ్డి దేవిని పడకల్ మాజీ సర్పంచ్ శ్రీశైలం మాజీ వార్డు సభ్యులు భాస్కర్ రెడ్డి కాసు వెంకటరెడ్డి జగన్మోహన్ రెడ్డి ఎలమందరెడ్డి రామచంద్రారెడ్డి ప్రతాపరెడ్డి వెంకటయ్య లక్ష ్మయ్య శేఖర్ తదితరులు ఉన్నారు.



## మృతురాలి కుటుంబానికి బియ్యం పంపిణీ

**తలకొండపల్లి 24 , ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామానికి చెందిన తిక్కల యాదమ్మ ఈనెల 19న మృతి చెందింది. నిరుపేద రాలైన తిక్కల యాదమ్మ మృతి చెందడంతో మెదక్ పెల్లి బిజెపి నాయకులు క్వింటాల్ బియ్యాన్ని ఉచితంగా మృతురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షులు తిక్కల మల్లేష్, నాయకులు నరేందర్ ప్రవీణ్ గౌడ్, తిక్కల మల్లయ్య కనుముని చిన్న సంతోష్ పర్వతాలు సానముని సంతు, మార్చ శీను తదితరులు పాల్గొన్నారు.

